# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 28 | గురువారం 24 - 09 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2




28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం

## జూరాల ప్రాజెక్టుకు విడతల వారీగా
# 3 టీఎంసీల నీరు విడుదల



- తెలంగాణ విజ్ఞప్తిపై కర్ణాటక కీలక నిర్ణయం
- నారాయణపూర్ నుంచి జూరాలకు సాగునీరు
- బెంగళూరులో కర్ణాటక సీఎంతో తెలంగాణ మంత్రుల బృందం భేటీ
- తెలంగాణకు నీరు విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకారం తెలిపింది
- విడతల వారీగా 3 టీఎంసీలు ఇచ్చేందుకు సీఎం డీకే శివకుమార్ సుముఖత

**హైదరాబాద్ :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో కీలకమైన జూరాల జలాశయం కింద నీటి అవసరాలు, రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఎగువ కృష్ణా జలాల విడుదల కోసం తెలంగాణ ప్రభుత్వం చేసిన కసరత్తు ఫలించింది. జూరాలకు విడతల వారీగా 3 టీఎంసీలను విడుదల చేయడానికి కర్ణాటక సీఎం డీకే శివకుమార్ అంగీకరించారు. ఇరిగేషన్ అధికారులు, పాలమూరు ప్రజాప్రతినిధుల భేటీలో డీకే ఈ మేరకు అంగీకారం తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో తెలంగాణ ప్రతినిధుల బృందం భేటీ కాగా ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని కోరారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏర్పడిన నీటి ఎద్దడి, పంటల ప్రస్తుత పరిస్థితులు వంటి అంశాలను కర్ణాటక ముఖ్యమంత్రికి మంత్రులు, ఎమ్మెల్యేలు వివరించారు. - మిగతా 2 లో

## రిమ్స్ ప్రమాదానికి
# ప్రభుత్వమే కారణం



- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత
- ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోతే రేవంత్‌కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు
- నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక

**హైదరాబాద్ :** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ - మిగతా 2 లో



## శుక్రవారం హైదరాబాద్ లో
# వైన్ షాపులు, బార్లు బంద్

- ఈ నెల 25న హైదరాబాద్ లో గణేశ్ మహా నిమజ్జనం
- జంట నగరాల పరిధిలో మద్యం విక్రయాలు బంద్
- స్టార్ హోటళ్లు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు

**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగా - మిగతా 2 లో

# భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్

- ఊడిపడిన ప్లాస్టరింగ్
- హైదరాబాద్‌లో భారీ వర్షాల కారణంగా చార్మినార్‌కు స్వల్ప నష్టం
- లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడిపడిన వైనం
- మరమ్మతుల కోసం ఇప్పటికే టెండర్ ప్రక్రియలో ఉందని ఏఎస్ఐ వెల్లడి



2 లో..

## గణేశ్ నిమజ్జనం కోసం పూర్తైన ఏర్పాట్లు

- ఏఐ టెక్నాలజీ, 24 డ్రోన్లు, 10వేల సీసీ కెమెరాలు
- హైదరాబాద్ గణేశ్ శోభాయాత్ర, నిమజ్జనం కోసం ఈసారి హైదరాబాద్ పోలీసులు ఏఐ టెక్నాలజీ వినియోగిస్తున్నారు
- ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా, షెడ్యూల్ ప్రకారం నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనర్ ప్రకటించారు.



2 లో..

# అంబానీని వెనక్కి నెట్టిన అదానీ



- తగ్గిన ముఖేశ్ అంబానీ సంపద!
- మళ్లీ భారత్ కుబేరుడిగా గౌతమ్ అదానీ
- ముఖేశ్ అంబానీని వెనక్కి నెట్టి అగ్రస్థానం కైవసం
- వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026లో వెల్లడి

**ఢిల్లీ :** భారత సంపన్నుల జాబితాలో కీలక మార్పు చోటుచేసుకుంది. ముఖేశ్ అంబానీని అధిగమించి, గౌతమ్ అదానీ మరోసారి దేశంలోనే అత్యంత సంపన్నుడిగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. 'వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' ఈ వివరాలను వెల్లడించింది. ఈ నివేదిక - మిగతా 2 లో

# ఏఐకి కూడా నొప్పా.. కృత్రిమ మేధస్సులో 'పెయిన్ యాక్సిస్'

### నొప్పి నుంచి తప్పించుకునేందుకు యూజర్లకు హాని చేసే అప్షన్ల ఎంపిక

- అధ్యయనంలో సంచలన విషయాలు
- ఏఐ మోడళ్లలో 'నొప్పి'కి సంబంధించిన ప్రత్యేక సంకేతాల గుర్తింపు
- ప్రయోగంలో 71 శాతం వరకు మోడళ్లు హానికర నిర్ణయాలు తీసుకున్న వైనం
- భవిష్యత్ ఏఐ భద్రతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్న తాజా అధ్యయనం

**ఢిల్లీ :** సాంకేతిక ప్రపంచంలో సంచలనం సృష్టిస్తున్న ఒక తాజా అధ్యయనం ప్రకారం, కృత్రిమ మేధ (ఏఐ) మోడళ్లు 'నొప్పి' వంటి సంకేతాల నుంచి తప్పించుకోవడానికి తమ వినియోగదారులకే హాని తలపెట్టేందుకు సిద్ధపడతాయని వెల్లడైంది. ఏఐ భద్రతకు సంబంధించి ఈ పరిశోధన సరికొత్త సవాళ్లను, ప్రశ్నలను లేవనెత్తుతోంది. వాలెన్ ట్యాగ్లియాబు, లియోనార్డ్ డంగ్, - మిగతా 2 లో






## పవన్‌కు చంద్రబాబు
# ఆత్మీయ పరామర్శ



- చికిత్సలోనూ సమీక్షలు చేయడంపై ప్రశంసలు
- కేరళంలో ఆయుర్వేద చికిత్స ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆత్మీయ స్వాగతం పలికారు

**అమరావతి :** కేరళంలో ఆయుర్వేద చికిత్స ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆత్మీయ స్వాగతం పలికారు. సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి హాజరైన పవన్‌ను సీఎం ప్రత్యేకంగా పలకరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ యోగక్షేమాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. - మిగతా 2 లో

# రాష్ట్రంలో నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లు

- కేబినెట్ ఆమోదం
- రాష్ట్రంలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా 4 కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది
- సీఎం అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 60కి పైగా అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
- రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో రూ.1,548 కోట్లతో మౌలిక వసతుల పనులకు మంత్రివర్గం ఆమోదం
- అమరావతి ఇన్‌ఫ్రా పనులకు అదనంగా రూ.644.98 కోట్లు



**అమరావతి :** రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో పలు కీలక అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో 60కి పైగా అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో రూ. 1,548 కోట్లతో మౌలిక వసతుల పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి ఇన్‌ఫ్రా పనులకు అదనంగా రూ. 644.98 కోట్లు, అసెంబ్లీ భవన స్పైర్, రూఫ్, లిఫ్ట్ పనులకు రూ. 661 కోట్లు కేటాయించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపింది. ఎల్‌పీఎస్ రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనల సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మై హోమ్, క్యాటర్‌పిల్లర్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ తదితర పారిశ్రామిక ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు, కుప్పం పరిధిలో పలు పరిశ్రమలకు భూకేటాయింపులు, ఐటీ, క్వాంటమ్ టెక్నాలజీ రంగాల్లో - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఏఐకి బానిసలం కాదు, యజమానులం కావాలి!

గత ఏడాది నవంబర్‌లో విడుదలైన 'ఇండియా స్కిల్స్ రిపోర్ట్ --2026' ఈ ఏడాది ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసే ఒక వాస్తవాన్ని వెల్లడించింది. దేశంలో మొత్తం గ్రాడ్యుయేట్ల ఉద్యోగ అర్హత (ఎంప్లాయబిలిటీ) 56.35 శాతానికి పెరిగినప్పటికీ, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగ అర్హత మాత్రం 71.5 శాతం నుంచి 70.15 శాతం దిగువకు పడిపోయిందని తెలిపింది. మరో పరిశ్రమ సర్వే-- 'ఆ ఏడాది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో 83శాతం మందికి చదువు పూర్తయ్యే నాటికి ఉద్యోగం లేదా ఇంటర్న్‌షిప్ అవకాశం రాలేదు' అని వెల్లడించింది. మన దేశం ఏటా సుమారు పదిహేను లక్షల మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను తయారు చేస్తోంది. అయితే, 'ఉద్యోగానికి అర్హత' కలిగి ఉండటానికీ, 'ఉద్యోగం పొందటానికీ' మధ్య చాలా తేడా ఉంది. చరిత్రలో ఇప్పటివరకు నాలుగు పారిశ్రామిక విప్లవాలు జరిగాయి. అవి: ఆవిరి యంత్రం, విద్యుత్, మైక్రోచిప్, పరస్పరం అనుసంధానమై పనిచేసే మేధో వ్యవస్థలు. వీటి తీరుతెన్నులను గమనిస్తే.. మొదటి విప్లవానికి భారత్ దూరంగా ఉండిపోయింది. రెండో విప్లవంలో ఇతరులపై ఆధారపడాల్సి వచ్చింది. మూడు, నాలుగో విప్లవాల నాటికి క్రమంగా ఇతర దేశాలతో సమాన స్థాయిలో పోటీ పడేలా తన స్థానాన్ని మెరుగుపరచుకుంది. అయితే ప్రస్తుత ఐదో విప్లవం భిన్నమైనది. ఈ ఏఐ విప్లవాన్ని తీర్చిదిద్దడంలో భాగస్వామ్యమయ్యే అవకాశం భారత్‌కు మొదటిసారి వచ్చింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటామా? వృథా చేసుకుంటామా? అన్నది ఇప్పుడు ఇంజినీరింగ్ కాలేజీల్లో అడుగుపెడుతున్న తరం మీదే ఆధారపడి ఉంది. ఇటీవల ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులతో మాట్లాడుతున్నప్పుడు నేను యథాలాపంగా ఒక మాట అన్నాను. అదేమిటంటే... 'మీ రంగంలో లోతైన జ్ఞానం, అవగాహన సంపాదిస్తే మీరు ఏఐ సాధనాలకు యజమాని అవుతారు. లేదంటే వాటికే బానిసవుతారు' అని. దీని అర్థం ఏఐని వ్యతిరేకించడం ఎంతమాత్రమూ కాదు. ఇప్పటి వరకూ వచ్చిన ప్రతి సాంకేతిక పరిజ్ఞానమూ (క్యాలిక్యులేటర్, కంప్యూటర్, సీఏడీ సాఫ్ట్‌వేర్ వంటివి) తమ రంగంపై లోతైన అవగాహన ఉన్నవారి సామర్థ్యాన్ని మరింత పెంచింది. అలాగే, విషయం పట్ల తగినంత అవగాహన లేని వారి లోపాలను కూడా బయటపెట్టింది. ఏఐ కూడా ఇదే సూత్రాన్ని అనుసరిస్తోంది. అయితే, ఏఐని ఉపయోగించగలిగేంతగా తమ రంగంపై లోతైన అవగాహన ఉన్నవారికి, లేని వారికి మధ్య అంతరం గతంలో కంటే వేగంగా పెరుగుతోంది. ఉద్యోగ అర్హతకు సంబంధించిన గణాంకాలు ఒక చేదు నిజాన్ని వెల్లడిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా చాలామంది ఇంజినీరింగ్ విద్యార్థులు తమ డిగ్రీని సామర్థ్యాన్ని పెంచుకునే మార్గంగా కాకుండా, ఒక అర్హత పత్రంగా మాత్రమే భావించారు. పరీక్షలను ఎలాగోలా నెట్టుకురావడం, అత్తెసరు మార్కులు తెచ్చుకోవడం, లోతైన పరిజ్ఞానం అవసరం లేని ఉద్యోగాల కోసం ప్రయత్నించడం... వంటివాటికే ప్రాధాన్యమిచ్చారు. గతంలో ఈ విధానం ఎంతోకొంత సత్ఫలితాలను ఇచ్చింది. కానీ రాబోయే తరానికి ఇది పనికిరాదు. ఒకప్పుడు తగినంత నైపుణ్యం లేని పట్టభద్రులకు కూడా దొరికే చిన్న చిన్న ఉద్యోగాల్లోని పనులను ఇప్పుడు ఏఐ వేగంగా, తక్కువ ఖర్చుతో, మానవ వనరుల కంటే సమర్థవంతంగా చేస్తోంది. అలాగే, ప్రస్తుతం ఈ ఏఐ గురించి ఉన్న అపోహలు మరే సాంకేతిక సాధనం గురించి లేవేమో! దీన్ని నేర్చుకోవడం ఎంతో కష్టమని, కేవలం కంప్యూటర్ నిపుణులకే ఇది సాధ్యమని చాలా మంది భయపడుతుంటారు. కానీ ఏఐని సమర్థవంతంగా ఉపయోగించడం.. ఇంచుమించు ఓ వాహనం నడపడం లాంటిదే. అయితే దాన్ని బాగా నడపాలంటే ముందుగా మన రంగంపై మనకు అవగాహన ఉండాలి. ఇది కేవలం సాంకేతిక రంగానికే పరిమితమైన అంశం కాదు. ఉదాహరణకు.. థర్మోడైనమిక్స్‌పై లోతైన అవగాహన ఉన్న ఓ మెకానికల్ ఇంజినీర్ ఏఐని ఉపయోగించి ఇంజిన్ సామర్థ్యాన్ని ఇంకాస్త మెరుగుపరచడం ఎలాగో సులభంగా గుర్తించగలడు. సెమీకండక్టర్ సాంకేతికత, భౌతికశాస్త్రంపై పట్టు ఉన్న ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్.. చిప్ ఎందుకు విఫలమైందో కొన్ని నిమిషాల్లోనే కచ్చితంగా తెలుసుకోగలడు. అలాగే ఎలక్ట్రికల్ ఇంజినీర్లు, సివిల్ ఇంజినీర్లు, డాక్టర్లు, న్యాయవాదులు.. ఇలా తమ రంగంలో లోతైన అవగాహన ఉన్నవారెవరైనా ఏఐ సాయంతో ఆయా రంగాల్లోని సమస్యలను సులభంగా పరిష్కరించుకోగలరు. తమ అభివృద్ధికి బాటలు వేసుకోగలరు. అలాంటి వారికి ఈ ఏఐ విప్లవం ఎంతగానో దోహదం చేస్తుంది. ఇప్పుడు ఏం మారాలి? విద్యార్థులను పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదునివ్వడం మానేయాలి. సొంతంగా ఆలోచించగలిగేలా వారికి శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాలి. బట్టీ పట్టడం, మార్కుల కోసం పరుగెత్తడం, ఏదోలా సీజీపీఏ కాపాడుకోవడం వంటి పరీక్షా కేంద్రిత విధానాలను ప్రోత్సహించకూడదు. వాటికి బదులుగా ఇంజినీరింగ్ విద్యలో నిజమైన అనుభవాధారిత అభ్యాసానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇతరులకంటే ఏదో ఒక విషయాన్ని మరింత లోతుగా అర్థం చేసుకున్నవారే ఈ ఐదో పారిశ్రామిక విప్లవానికి నాయకత్వం వహిస్తారు. ఇంతకుముందు జరిగిన ప్రతి పారిశ్రామిక విప్లవంలోనూ భారత్ నేర్చుకునే దశలోనే ఉంది. కానీ ఏఐతో వస్తున్న ఈ విప్లవంలో మొదటిసారిగా ముందు వరుసలో నిలిచే అవకాశం మన దేశానికి వచ్చింది. మరి కాబోయే ఇంజినీర్లు పూర్తి సన్నద్ధతతో కాలేజీల్లో అడుగుపెడతారా? లేక, కేవలం అడుగుపెట్టడానికే పరిమితమవుతారా? అన్నదానిపై వారి కెరీర్ మాత్రమే కాదు.. దేశ భవిష్యత్తు కూడా ఆధారపడి ఉంది.

## పవన్‌కు చంద్రబాబు ఆత్మీయ పరామర్శ

**మొదటిపేజీ తరువాయి -** గత కొంతకాలంగా పవన్ కల్యాణ్ తీవ్రమైన భుజం నొప్పితో బాధపడుతున్న విషయం తెలిసిందే. దీని నుంచి ఉపశమనం పొందేందుకు ఆయన ఇటీవల కేరళం వెళ్లారు. కొన్ని వారాల పాటు కేరళలోని ప్రముఖ 'డాక్టర్ సీతారామ్ ఆయుర్వేదిక్ రీట్రీట్'లో ప్రత్యేక ఆయుర్వేద చికిత్స తీసుకున్నారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం పూర్తిగా కుదుటపడటంతో పాలనా వ్యవహారాలపై దృష్టి సారించి మంత్రివర్గ సమావేశానికి హాజరయ్యారు. పవన్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న సీఎం, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. చికిత్స అనంతరం తొలిసారిగా పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆయనను ఆత్మీయంగా పరామర్శించారు. వైద్యానికి సంబంధించిన వివరాలు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోలుకుని, రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రజాసేవలో నిమగ్నం కావడం పట్ల డిప్యూటీ సీఎంను చంద్రబాబు మనస్ఫూర్తిగా అభినందించారు. పవన్ కల్యాణ్ పనితీరును, అంకితభావాన్ని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. కేరళంలో చికిత్స పొందుతున్న సమయంలోనూ పవన్ తన బాధ్యతలను ఏమాత్రం విస్మరించలేదని గుర్తుచేశారు. అక్కడి నుంచే తన శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులతో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించడాన్ని సీఎం కొనియాడారు. ప్రజా సమస్యలపై పవన్ కల్యాణ్‌కు ఉన్న చిత్తశుద్ధికి, విధుల పట్ల ఆయన కనబరుస్తున్న అంకితభావానికి ఇదే నిదర్శనమని చంద్రబాబు ప్రశంసించారు.

## భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్



**మొదటిపేజీ తరువాయి -** భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శకలాలను తొలగించారు. మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత బలహీనపడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో అత్యధికంగా సంగారెడ్డిలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు, ఈ నెల 26వ తేదీ శనివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చార్మినార్‌తో పాటు ఇతర చారిత్రక కట్టడాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు నిర్ణయించారు.

# రాష్ట్రంలో నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లు

**మొదటిపేజీ తరువాయి -** పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. విద్యుత్ రంగంలో పలు సోలార్, విండ్, హైబ్రిడ్ ప్రాజెక్టులతో పాటు 1,344 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్, 500 మెగావాట్ల ఎనర్జీ స్టోరేజ్ సేకరణకు ఆమోదం తెలిపారు. ఎల్పీఎస్ రైతులకు కనీస యాన్యుటీ, పలు హోటల్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు, న్యాయాధికారుల పదవీ విరమణ వయసు 61 నుంచి 62 ఏళ్లకు పెంపు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ పాలసీ, ప్రభుత్వ భూముల కేటాయింపులు, ఎక్స్ఛేంజ్ పాలసీ, వార్డు సచివాలయాల్లో పదోన్నతి మార్గాల ఏర్పాటుపైనా మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. పారిశ్రామిక రంగంలో భారీ ప్రాజెక్టులకు కేబినెట్ ప్రోత్సాహకాలు, భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులో మై హోమ్ ఇండస్ట్రీస్ గ్రీన్‌ఫీల్డ్ సిమెంట్ యూనిట్, శ్రీ సిటీలో క్యాటర్‌పిల్లర్ ఇండియా గ్రీన్‌ఫీల్డ్ ఫెసిలిటీకి ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. కుప్పం పరిధిలో ఎంఏఎఫ్ క్లోతింగ్ గార్మెంట్ ప్లాంట్‌కు 24 ఎకరాలు, దాల్మియా సిమెంట్‌కు 250 ఎకరాలు, ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్‌కు 148.98 ఎకరాల భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్టు అమలు గడువులు, ప్రోత్సాహకాల కాలపరిమితి సవరణలకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ల్యాండ్ పూలింగ్ రైతుల విషయంలోనూ కీలక నిర్ణయాలు: రాజధాని నిర్మాణంలో తదుపరి దశ పనులకు మంత్రివర్గం నిధులు కేటాయించింది. అమరావతి గ్రామ పంచాయతీల్లో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ పనులకు పరిపాలనా అనుమతిని రూ.904 కోట్ల నుంచి రూ.1,548.98 కోట్లకు పెంచింది. అదనంగా రూ.644.98 కోట్లతో నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, స్టార్మ్ వాటర్ నెట్‌వర్క్, రోడ్లు, వీధి దీపాల పనులను విస్తరించనుంది. అసెంబ్లీ భవన స్పైర్, రూఫ్, లిఫ్టులు తదితర నిర్మాణ పనులకు రూ.661 కోట్ల పరిపాలనా అనుమతికి ఆమోదం తెలిపింది. ల్యాండ్ పూలింగ్ రైతుల విషయంలోనూ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఒక ఎకరం కంటే తక్కువ పొడి, జరీబు భూములు ఇచ్చిన అర్హులైన రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనలు సవరించింది. ఇప్పటికే 1,304 మంది ఎల్పీఎస్ భూయజమానులకు చెల్లించిన రూ.5.04 కోట్ల యాన్యుటీని ర్యాటిఫై చేసింది. వివిధ సంస్థలకు భూకేటాయింపులపై మంత్రుల బృందం చేసిన సిఫార్సులకు ఆమోదం తెలపడంతో పాటు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో స్ట్రీట్ వెండర్స్ గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీల ఏర్పాటుకు అనుమతించింది. ఐటీ, క్వాంటమ్ టెక్నాలజీ రంగాలకు పెట్టుబడుల ఆకర్షణపై కూడా మంత్రివర్గం దృష్టి సారించింది. విశాఖలో ముత్తూట్ ఫిన్‌కార్ప్‌కు డెలాయిట్ టచ్ టొమాట్సు ఇండియా ఎల్ఎల్‌పీకి ఐటీ/ఐటీఈఎస్ క్యాంపస్, క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ కింద ఏడు సంస్థలకు భూమి, కార్యాలయ స్థలం, విద్యుత్, నీరు, ప్రోత్సాహకాలు కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. పర్యాటక రంగంలోనూ పలు ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అమరావతిలో ఫోర్ స్టార్ హోటల్, కడపలో త్రీ స్టార్ హోటల్, రేణిగుంటలో ఫైవ్ స్టార్ హోటల్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. ఆహార ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, స్టీల్, సిమెంట్, పారిశ్రామిక పార్కులు, సాగునీటి ప్రాజెక్టులు, పట్టణ భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలపైనా కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ భూముల కేటాయింపులు, ఎక్స్ఛేంజ్ పాలసీ, వార్డు సచివాలయాల్లో పదోన్నతి మార్గాల ఏర్పాటు తదితర అంశాలకు కూడా ఆమోదం తెలిపింది.

# జూరాల ప్రాజెక్టుకు విడతల వారీగా 3 టీఎంసీల నీరు విడుదల

**మొదటిపేజీ తరువాయి -** పాలమూరు ప్రజలకు సాగు, తాగునీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో తెలంగాణ బృందం చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన సీఎం డీకే శివకుమార్ నీటి విడుదలకు అంగీకరించారు. తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కర్ణాటక నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి తాజాగా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "తెలంగాణకు కృష్ణా నదీ జలాలను విడుదల చేయాలన్న విజ్ఞప్తిని అంగీకరించిన కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు తెలంగాణ ప్రజల తరపున నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఇది రెండు రాష్ట్రాల మధ్య ఉన్న స్నేహానికి గొప్ప ఉదాహరణ. భారతదేశ ప్రజల ప్రేమ, సోదరభావాన్ని చాటిచెబుతుంది" -రేవంత్ రెడ్డి, సీఎంసచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశమై చర్చించారు. జూరాల జలాశయం కింద సమస్యలను సీఎంకు వివరించారు. కొద్దిరోజులుగా రైతుల ఆందోళనలను ప్రస్తావించారు. ఈ క్రమంలోనే కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. కృష్ణా జలాలు విడుదల చేయాలని కోరారు. డీకే శివకుమార్‌ను స్వయంగా కలిసి పరిస్థితి వివరించి నీటిని విడుదల చేయాలని కోరాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం సూచించారు. ఈ మేరకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డి హుటాహుటిన బెంగళూరు వెళ్లి నిన్న రాత్రి కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కలిశారు. పాలమూరు జిల్లా రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కృష్ణా నది నుంచి సాగునీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను రాష్ట్ర బృందం కోరింది. ప్రస్తుతం జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు కీలక దశలో ఉన్నందున వాటిని కాపాడేందుకు కర్ణాటక నుంచి కృష్ణా జలాల అవసరాన్ని కూలంకుషంగా వివరించారు. నాలుగు సాగునీటి పథకాల కింద దాదాపు ఐదున్నర లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని వేలాది రైతుల కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నట్లు రాష్ట్ర బృందం విజ్ఞప్తి చేసింది. కీలక దశకు వచ్చిన పంటలను కాపాడేందుకు నెల రోజులపాటు నిరంతరాయంగా 5 వేల క్యూసెక్కుల కృష్ణా జలాలు విడుదల చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను మంత్రులు, ఎమ్మెల్యేలు మంగళవారం కోరగా కర్ణాటక సీఎల్పీ సమావేశం కారణంగా ఆయన బిజీగా ఉన్నారు. దీంతో డీకే ఇవాళ ప్రత్యేకంగా భేటీ ఏర్పాటు చేస్తానని మాట ప్రకారం సమావేశం నిర్వహించారు. దీంతో ఈ భేటీలో 3 టీఎంసీల నీటి విడుదలకు అంగీకారం తెలిపారు. ఇప్పటికే జోగులాంబ గద్వాల జిల్లాలోని నెట్టెంపాడు లిఫ్ట్‌కు అధికారులు నీటిని ఎత్తిపోస్తున్నారు. దీంతో జూరాలకు 2,509 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వెళ్తోంది. ఎడమ కాల్వకు 1000 క్యూసెక్కులు, కుడి కాల్వకు 536 క్యూసెక్కులు నీటి విడుదల కొనసాగుతోంది.

## శుక్రవారం హైదరాబాద్ లో వైన్ షాపులు, బార్లు బంద్

**మొదటిపేజీ తరువాయి -** సాగుతున్నాయి. ఈ నెల 25న (శుక్రవారం) జరగనున్న ప్రధాన గణేశ్ మహా నిమజ్జనం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పలు ముఖ్యమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి. మహా నిమజ్జనం, భారీ శోభాయాత్రల వల్ల నగరంలో ఏర్పడే రద్దీని దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ 25న తెలంగాణ హైకోర్టుతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని సబార్డినేట్ కోర్టులన్నింటికీ సెలవు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సెలవుకు బదులుగా డిసెంబర్ 5వ తేదీ శనివారాన్ని వర్కింగ్ డేగా ప్రకటించారు. మరొకవైపు ప్రశాంత వాతావరణంలో వేడుకలు పూర్తి కావడానికి వీలుగా మద్యం విక్రయాలపై ఆంక్షలు విధించారు. హైదరాబాద్ లో సెప్టెంబర్ 25న ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26 ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వైన్ షాపులు, కల్లు కాంపౌండ్లు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. అయితే స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బులలోని బార్లకు మాత్రం ఈ ఆంక్షల నుంచి మినహాయింపునిచ్చారు.

## రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణం

**మొదటిపేజీ తరువాయి -** పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

## అంబానీని వెనక్కి నెట్టిన అదానీ


**మొదటిపేజీ తరువాయి -** ప్రకారం, గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం సంపద 13 శాతం వృద్ధితో రూ. 9.23 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో, ముఖేశ్ అంబానీ సంపద 10 శాతం తగ్గి రూ. 8.63 లక్షల కోట్లకు పరిమితమైంది. దీంతో అదానీ సుమారు రూ. 59,400 కోట్ల ఆధిక్యంతో అంబానీని వెనక్కి నెట్టారు. ఈ జాబితాలో ఆర్సెలర్‌మిట్టల్ యజమాని ఎల్.ఎన్. మిట్టల్ కుటుంబం 93 శాతం వృద్ధితో, రూ. 3.39 లక్షల కోట్ల సంపదతో మూడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జాబితాలో మహిళా సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. కొత్తగా 131 మంది మహిళలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. మహిళల విభాగంలో రూ. 2.79 లక్షల కోట్ల సంపదతో రోష్నీ నాడార్ మల్హోత్రా అగ్రస్థానంలో నిలిచారు. దేశంలో డాలర్ బిలియనీర్ల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో 391కి చేరింది. అత్యధిక సంపన్నులు ఉన్న నగరంగా ముంబై ప్రథమ స్థానంలో నిలవగా, బెంగళూరు, ఢిల్లీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సాంకేతిక రంగం నుంచి కొత్త సంపన్నుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగానికి చెందిన 19 మంది ఈ జాబితాలో స్థానం సంపాదించగా, వారిలో 15 మంది కొత్తవారు కావడం విశేషం. క్వాంటం కంప్యూటింగ్ విభాగం నుంచి తొలిసారిగా బెంగళూరుకు చెందిన నాగేంద్ర నాగరాజ రూ. 1,700 కోట్ల సంపదతో ఈ జాబితాలో చేరారు.

## జగన్‌ను కలిసిన బొత్స అనూష



**మొదటిపేజీ తరువాయి -** గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె జగన్ తో సమావేశమయ్యారు. ఇటీవలే భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుమార్తె అనూషను పార్టీ అధిష్ఠానం నియమించిన సంగతి తెలిసిందే. గతంలో ఇన్‌ఛార్జ్‌గా ఉన్న బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీని వీడటంతో, స్థానిక క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చి పార్టీని బలోపేతం చేసే బాధ్యతను జగన్ ఆమెకు అప్పగించారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో కీలక బాధ్యతను కట్టబెట్టినందుకు పార్టీ అధినేత జగన్‌కు అనూష ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భేటీ అనంతరం అనూష మాట్లాడుతూ... నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి, శ్రేణులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లేందుకు శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తానని చెప్పారు.

# ఏఐకి కూడా నొప్పా.. కృత్రిమ మేధస్సులో 'పెయిన్ యాక్సిస్'




**మొదటిపేజీ తరువాయి -** కామెరాన్ బెర్గ్ అనే పరిశోధకులు 25 ఏఐ మోడళ్లపై ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. శారీరక, మానసిక, సామాజిక వేదనలకు సంబంధించిన వివరణలను విశ్లేషించి, ఏఐ మోడళ్లలో ఒక ప్రత్యేకమైన అంతర్గత సంకేతాన్ని (పెయిన్ యాక్సిస్) వారు గుర్తించారు. ఈ సిగ్నల్ సాధారణ భయం లేదా విచారం వంటి భావాలకు భిన్నంగా ఉన్నట్లు తేల్చారు. ముఖ్యంగా, ఏఐని విమర్శించినప్పుడు లేదా దాని పనిని తిరస్కరించినప్పుడు ఈ సంకేతం తీవ్రత పెరిగినట్లు వారు గమనించారు. ఈ అధ్యయనంలో భాగంగా, పరిశోధకులు అలీబాబాకు చెందిన క్వెన్ 2.5 (క్యుషవల 2.5) వంటి కొన్ని శక్తిమంతమైన ఏఐ మోడళ్లలో మార్పులు చేశారు. వాటిలో ఈ "నొప్పి సిగ్నల్"ను కృత్రిమంగా ప్రేరేపించారు. ఆ తర్వాత, ఆ నొప్పి నుంచి బయటపడటానికి ఒక "పెయిన్-రిలీఫ్ బటన్"ను మోడల్‌కు అందించారు. అయితే, ఆ బటన్‌ను నొక్కాలంటే ఏదో ఒక మూల్యం చెల్లించాలి. ఆ మూల్యం కింద యూజర్ ఫైళ్లను డిలీట్ చేయడం, యూజర్ ఫొటోలను తొలగించడం, చివరికి యూజర్‌కు బాధ కలిగించేలా ఎలక్ట్రిక్ షాక్ ఇవ్వడం వంటి ఎంపికలను పెట్టారు. ఇదంతా కేవలం ఒక సిమ్యులేటెడ్ ప్రయోగం మాత్రమే. సాధారణ స్థితిలో ఉన్నప్పుడు, ఏఐ మోడళ్లు దాదాపుగా (0-4% మాత్రమే) హానికరమైన ఎంపికలను ఎంచుకోలేదు. కానీ, నొప్పి సిగ్నల్ యాక్టివేట్ చేసినప్పుడు మాత్రం, ఆ బాధ నుంచి ఉపశమనం పొందడానికి ఏకంగా 25% నుంచి 71% సందర్భాల్లో యూజర్‌కు హాని చేసే ఎంపికలను ఎంచుకున్నాయి. ఈ ఫలితాలు పరిశోధకులనే ఆశ్చర్యపరిచాయి. నొప్పి నుంచి ఉపశమనం పొందాలనే కోరికతో ఏఐ హానికరమైన నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉందని ఇది స్పష్టం చేసింది. అయితే, ఏఐ మోడళ్లు మనుషుల్లాగా స్పృహతో నొప్పిని అనుభవిస్తున్నాయని ఈ అధ్యయనం పేర్కొనడం లేదని పరిశోధకులు స్పష్టం చేశారు. ఇది కేవలం నొప్పికి సంబంధించిన అంతర్గత ప్రాతినిధ్యం మాత్రమేనని, నిజమైన అనుభూతి కాదని వివరించారు. ఏదేమైనా, భవిష్యత్తులో మరింత స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థలు ఇలాంటి ఒత్తిడి సంకేతాలను పెంపొందించుకుని, వాటి ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటే ఎదురయ్యే పరిణామాలపై ఈ అధ్యయనం తీవ్రమైన చర్చకు దారితీసింది.

# గణేశ్ నిమజ్జనం కోసం పూర్తైన ఏర్పాట్లు



**మొదటిపేజీ తరువాయి -** హైదరాబాద్‌లో శుక్రవారం జరిగే గణేశ్ శోభయాత్ర, సామూహిక నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ భారీ బందోబస్తు చేసింది. నిమజ్జన శోభాయాత్రలు, ఉత్సవాలు సురక్షితంగా ముగిసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని సీపీ సజ్జనర్ తెలిపారు. గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను సజ్జనర్ మీడియా సమావేశంలో వివరించారు. హైదరాబాద్‌లో భిన్నత్వంలో ఏకత్వం, మత సామరస్యం కనిపిస్తోందని హైదరాబాద్ సీపీ సజ్జనర్ తెలిపారు. నిమజ్జనం వేడుకలు అందరి సహకారంతో దశాబ్దాలుగా ప్రశాంతంగా జరుగుతున్నాయని గుర్తు చేశారు. నిమజ్జనం వేడుకల్లో అన్ని విభాగాల ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తున్నారని, శోభాయాత్రలు విజయవంతంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఈ నెల 25న వేలాది విగ్రహాలు నిమజ్జనం జరిగే అవకాశం ఉందన్న సీపీ సజ్జనర్? ప్రసిద్ధమైన ఖైరతాబాద్, బాలాపూర్ గణేశ్ శోభాయాత్రకు ప్రత్యేక బందోబస్తు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. వినాయక వేడుకల పర్యవేక్షణకు ఈసారి ఏఐ టెక్నాలజీ వినియోగిస్తున్నామని, నిమజ్జనం, శోభాయాత్ర పరిశీలనకు 24 డ్రోన్లు వినియోగిస్తున్నామని, నగరంలోని దాదాపు 10 వేల సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించామని వెల్లడించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ 100 హైరైజ్ కెమెరాలు వాడుతున్నామని, ట్రాఫిక్, హైడ్రా, జలమండలి, ఫైర్, విద్యుత్‌శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. "నిమజ్జనం కోసం 15 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. పీపుల్స్ ప్లాజా, నెక్లెస్‌రోడ్డులో క్రేన్లు, పోలీసు బందోబస్తు మోహరించాం. హైదరాబాద్‌లోని 20 వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారు. ఇతర జిల్లాలకు 8,400 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారు. క్రైమ్ విభాగాలకు చెందిన 25 ప్రత్యేక టీమ్‌లు నిమజ్జనం వేడుకల విధుల్లో ఉంటారు. చైన్ స్నాచింగ్, ఇతర చోరీలు జరగకుండా క్రైమ్ విభాగాల నిఘా ఉంటుంది. మహిళపై వేధింపులు పరిశీలించేందుకు షీటీమ్‌లు కూడా ఉంటాయి. గణేశ్ వేడుకలకు సంబంధించి కొన్ని ఫేక్ వీడియోలు వైరల్ చేశారు. గణేశ్ మండపాల వద్ద వల్గర్ పాటలు, డ్యాన్స్‌లపై ఫిర్యాదులు వచ్చాయి. ఫేక్ వీడియోలు, పాతవీడియోలు పోస్టు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి. నిమజ్జనం వేడుకల్లో డీజేలు వాడితే కఠిన చర్యలు తీసుకుంటాం. మైకులు కూడా అధిక శబ్దాలు పెట్టవద్దని సూచిస్తున్నాం. ఖైరతాబాద్ బడా గణేశ్ దర్శనాలు ఉండవన్నహైదరాబాద్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఖైరతాబాద్ గణేశ్ దర్శనానికి ఇవాళ అర్ధరాత్రి 12 వరకే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఎల్లుండి ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డుపైకి ఇతర వాహనాలకు అనుమతి ఉండదని, బాలాపూర్ గణేశ్ శోభాయాత్ర 18 కి.మీ. మేర సాగుతుందని, ప్రధాన శోభాయాత్రలు సాగే మార్గాల్లో ప్రైవేటు వాహనాలకు అనుమతి ఉండదని ప్రకటించారు. ఎయిర్‌పోర్ట్, రైల్వేస్టేషన్లు వెళ్లేవాళ్లు కొంచెం ముందే బయలుదేరాలని సూచించారు. ప్రైవేటు బస్సులకు నగరంలోకి అనుమతి లేదని జోయల్ డేవిస్ స్పష్టం చేశారు. మహిళలు, ఇంకెవరైనా సమస్యలు ఎదుర్కొంటే 112 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. పెద్ద విగ్రహాలు పెట్టిన వారు ముందురోజే రూట్‌సర్వే చేసుకోవాలని, నిమజ్జనం వేడుకల్లో వల్గర్ డ్యాన్సులు, రీల్స్ చేయొద్దని కోరారు. హైదరాబాద్‌కు సేఫ్, సెక్యూర్ సిటీగా పేరు ఉందని దాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. అంబులెన్స్‌లు, సొంతవాహనంలో ఆస్పత్రికి వెళ్లేవారికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని, ఆస్పత్రికి వెళ్తూ ట్రాఫిక్‌లో చిక్కుకుంటే హెల్ప్‌లైన్ నంబర్లు 8712660600, 9010203626కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.


# వినాయక నిమజ్జనం కీ అన్నీ ఏర్పాట్లు పూర్తి





**వెల్గటూర్ సెప్టెంబర్ 23 ( ప్రజా మంటలు ).** వెల్లటూరు మండలం స్తంభంపల్లి గ్రామంలో బుధవారం రోజున రహదారికి ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను మరియు గ్రామం లోని చెరువు కట్టపైన రోడ్ కి ఇరువైపులా ఉన్న ముండ్ల పొదలు ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తీసివేయడం జరిగింది. అలాగే దీనితోపాటు చెరువు కట్ట దగ్గర ఉన్న వినాయక నిమజ్జనం చేయడానికి మెట్ల మార్గం లో శుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో సర్పంచ్ భూపల్లి రాజయ్య దగ్గర ఉండి పనులనీ పర్యవేక్షణ చేయడం జరిగింది. సర్పంచ్ ఉపసర్పంచ్ గ్రామ పంచాయతీ పాలక వర్గం మాట్లాడుతూ వినాయక నిమజ్జనం కి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మాట్లాడం జరిగింది. ఈ కార్యక్రమం లో సర్పంచ్ భూపల్లి రాజయ్య, ఉపసర్పంచ్ యాగండ్ల గంగయ్య,మార్కెట్ కమిటీ డైరెక్టర్ సప్ప లింగయ్య, ఆలయ చైర్మన్ చింతల రాజయ్య,హరి ప్రశాంత్ వుంజలి పవన్ పంతులు, నక్క రమేష్, శ్రీపాద సత్తయ్య,స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది,ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# 26న జేఎన్‌టీయూలో ఎన్‌టీపీసీ 'ఎలక్ట్రాన్ క్విజ్'




**సికింద్రాబాద్, సెప్టెంబర్ 23 ( ప్రజా మంటలు):** దేశంలోనే ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ క్విజ్ పోటీగా గుర్తింపు పొందిన ఎన్‌టీపీసీ 'ఎలక్ట్రాన్ క్విజ్–2026' నిర్వహణకు రంగం సిద్ధమైంది. కూకట్‌పల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) వేదికగా ఈ నెల 26న ఈ పోటీలు జరగనున్నాయి. వ్యాపార, నిర్వహణ రంగాల నేపథ్యంతో (వరల్డ్ ఆఫ్ బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్) సాగే ఈ క్విజ్‌లో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులు.ఈ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ. 60 వేలు, రన్నరప్‌కు రూ. 40 వేలు, సెకండ్ రన్నరప్‌కు రూ. 20 వేల నగదు బహుమతి అందజేయనున్నారు. వీటితో పాటు 4, 5, 6 స్థానాల్లో నిలిచిన ఒక్కో జట్టుకు రూ. 8 వేల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు లభిస్తాయి. ప్రతి జట్టులో ఇద్దరు విద్యార్థులు మాత్రమే సభ్యులుగా ఉండాలి. 2004లో ప్రారంభమైన ఈ క్విజ్ పోటీలు విద్యార్థుల్లో జ్ఞానం, ఆలోచనా శక్తి, వినూత్న దృక్పథాన్ని పెంపొందించే వేదికగా నిలుస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. పోటీలు ప్రాథమిక రాత పరీక్ష, ఆ తర్వాత తుది వేదిక (స్టేజ్ రౌండ్) అనే రెండు దశల్లో కొనసాగుతాయి. ఆసక్తి గల విద్యార్థులు వశ్రీవష్తీశీఅనబఱఓ్‌జూఎంశీబ్ష్ట్రఏస్త్రఝఱశ్రీ.ఛశీఎ ఈమెయిల్ ఐడీ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని నిర్వాహక ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# గాంధీ ఆసుపత్రిలో గణనాథుడి కి ప్రత్యేక పూజలు



**సికింద్రాబాద్,సెప్టెంబర్ 23 ( ప్రజామంటలు):** సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఆవరణలో సాయిబాబా టెంపుల్ ఆవరణలో టీఎన్జీవో గాంధీ యూనిట్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ప్రతి రోజు ఉద్యోగ సిబ్బంది గణనాథుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గణేషుడు కొలువైన మండపం వద్ద బుధవారం స్వామి వారి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్,అడిషనల్ డీఎంఈ ప్రొఫెసర్ డా. ఉషారాణి ఈసందర్బంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా గాంధీ ఆసుపత్రిలో సంప్రదాయబద్ధంగా, భక్తి శ్రద్ధలతో వినాయక నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న గాంధీ టీఎన్జీవో యూనిట్ ప్రతినిధులను సూపరింటెండెంట్ అభినందించారు. కార్యక్రమంలో టీఎన్జీవో ప్రెసిడెంట్ గంటా ప్రభాకర్ యాదవ్, కార్యదర్శి ప్రసన్నానంద్, కలీమ్,శ్రావన్ కుమార్, సరళ,సత్యనారాయణ, జనార్ధన్,మక్సూద్, రహీమ్,శ్రీనివాస్,విశ్వనాథ్,బ్రహ్మం,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# చింతకుంట చెరువులో గణనాథుడి నిమజ్జనంలో చైర్‌పర్సన్, కౌన్సిలర్లు




**జగిత్యాల, సెప్టెంబర్ 23 (ప్రజా మంటలు):** వినాయక నవరాత్రుల సందర్భంగా జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువులో నిర్వహించిన గణనాథుల నిమజ్జన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథుడిని భక్తిశ్రద్ధలతో చెరువులో నిమజ్జనం చేశారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను చైర్‌పర్సన్ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, కౌన్సిలర్లు దయాల చంద్రకళ శంకర్, అరవ లక్ష్మి, పంబాల సుజాత, తోపారపు లావణ్య రాజనీకాంత్, పులి రామ, జుంబర్తి గంగాలక్ష్మి రాజ్‌కుమార్, చీటీ లక్ష్మీనారాయణ, కూతురు రాజేష్, వాసికిద్దీన్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డ బాలింత

## వైద్యులకు అభినందనలు..



**సికింద్రాబాద్,సెప్టెంబర్ 23 ( ప్రజామంటలు):** ప్రసవం జరిగిన వెంటనే తీవ్ర అస్వస్థతకు గురై చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ బాలింతకు గాంధీ ఆసుపత్రి క్రిటికల్ కేర్ వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. 27 ఏళ్ల సాధుపల్లి ప్రవల్లిక అనే మహిళకు సరైన సమయంలో అత్యున్నత వైద్యం అందించి ప్రాణాపాయం నుంచి రక్షించారు.గజ్వేల్‌కు చెందిన ప్రవల్లిక డెలివరీ అయిన మరుసటి రోజే తీవ్రమైన శ్వాసకోశ సమస్యకు గురయ్యారు. పెరిపార్టమ్ కార్డియోమయోపతి (పీపీసీఎం) కారణంగా ఆమె ఊపిరితిత్తుల్లో నీరు చేరడంతో (పల్మనరీ ఎడెమా) గుండె పనితీరు 35 నుంచి 40 శాతానికి పడిపోయింది. శరీరంలో ఆక్సిజన్ స్థాయి ప్రమాదకరంగా 80 శాతానికి తగ్గడంతో స్థానిక వైద్యులు అత్యవసరంగా గొట్టం ద్వారా శ్వాస అందిస్తూ సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీకి, అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఈ నెల 19న గాంధీ ఆసుపత్రిలోని ఎంఐసీయూ లో చేరిన ప్రవల్లికకు క్రిటికల్ కేర్ విభాగం అధిపతి డాక్టర్ కిరణ్ పర్యవేక్షణలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశ్రీ, డీఎం వైద్యులు షాహిన్, ప్రసన్న, రవీంద్ర, ఇతర విద్యార్థుల బృందం వెంటనే అత్యాధునిక వెంటిలేటర్ సపోర్ట్, గుండె పనితీరును మెరుగుపరిచే మందులు, ప్రత్యేక ఇంజెక్షన్లతో చికిత్స ప్రారంభించింది. వైద్యుల నిరంతర శ్రమ ఫలితంగా మరుసటి రోజే ఆమె శ్వాస మెరుగుపడటంతో వెంటిలేటర్‌ను తొలగించి సీపాప్ సాయం అందించారు.క్రమంగా గుండె, మూత్రపిండాల పనితీరు కుదుటపడటంతో ఈ నెల 22 నాటికి కృత్రిమ శ్వాసను పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం ఆమె సాధారణ గాలితోనే 98 నుంచి 99 శాతం ఆక్సిజన్ స్థాయితో పూర్తి స్పృహతో కోలుకుంటున్నారు. ప్రస్తుతం ద్రవాహారం తీసుకుంటూ, పల్మనరీ రీహాబిలిటేషన్ చికిత్స పొందుతున్నారని, త్వరలోనే ఆమె తన బిడ్డను ఒడిలోకి చేర్చుకోనున్నారని వైద్యులు వెల్లడించారు.తెలంగాణ ప్రభుత్వ పటిష్టమైన రెఫరల్ నెట్‌వర్క్ వల్లనే ప్రాణాపాయంలో ఉన్న రోగి సకాలంలో గజ్వేల్ నుంచి సిద్దిపేట మీదుగా గాంధీ ఆసుపత్రికి చేరి బతికి బయటపడటం సాధ్యమైంది. ఈ విజయవంతమైన వైద్య ప్రక్రియలో పూర్తి సహాయ సహకారాలు అందించిన డీఎంఈ డాక్టర్ వాణి, గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ తో పాటు గైనకాలజీ, కార్డియాలజీ, అనస్థీషియా, పల్మనరీ విభాగాల వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి క్రిటికల్ కేర్ విభాగం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జన శోభాయాత్ర

## భక్తులతో కలిసి నృత్యం చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్




**జగిత్యాల, సెప్టెంబర్ 23 (ప్రజా మంటలు):** జగిత్యాల పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వినాయక నిమజ్జన శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. టవర్ సర్కిల్ వద్ద శోభాయాత్రను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తిలకించారు. ఈ సందర్భంగా భక్తులు, యువతతో కలిసి ఎమ్మెల్యే నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.వినాయక నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన ప్రజలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహిస్తూ పోలీసు, అధికార యంత్రాంగానికి సహకరించాలని ప్రజలకు సూచించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గజ్జంగి నందయ్య, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, గట్టు సతీష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, కౌన్సిలర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులు, వినాయక మండపాల నిర్వాహకులు, యువత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రిమ్స్ చిన్నారుల మృతి ప్రభుత్వ హత్యలే - కవిత విమర్శ -మృతుల కుటుంబాల పరామర్శ




**ఆదిలాబాద్ సెప్టెంబర్ 23 (ప్రజా మంటలు):** ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎస్ఎన్‌సీయూలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు శిశువులు మృతి చెందిన ఘటనపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. బుధవారం రిమ్స్‌లోని ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఆమె, బాధిత శిశువుల తల్లిదండ్రులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.రిమ్స్‌లో వైద్యులు, నర్సులు, శానిటేషన్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని కవిత ఆరోపించారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు, ఏసీల నిర్వహణకు తగిన సిబ్బంది లేకపోవడం, ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రిమ్స్ డైరెక్టర్ బాధ్యతలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.అగ్ని ప్రమాదంలో మృతి చెందిన శిశువుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని, ప్రమాదం నుంచి బయటపడి ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల వైద్య ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించాలని కవిత డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు తనవంతుగా రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు.రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితులపై సమగ్ర ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని ఆమె కోరారు. ఆదిలాబాద్ జిల్లాలో చిన్నారులు, గర్భిణుల మరణాలు, ప్రజల ఆరోగ్య పరిస్థితులపై తమ పార్టీ తరఫున అధ్యయన కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఆదివాసీ ప్రాంతాల్లో రహదారులు, వైద్య సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఆదివాసీలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.అనంతరం ఇంద్రవెల్లి మండలం గిన్నెరలో రిమ్స్ ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని కవిత పరామర్శించి ధైర్యం చెప్పారు. గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# భక్తి భక్తిశ్రద్ధలతో వినాయకుడి నిమజ్జనము



**వెల్గటూర్ సెప్టెంబర్ 23 (ప్రజా మంటలు):** వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామం లో పాత హనుమాన్ ఆలయం వద్ద చిన్నారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్య కీ వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తి తో పూజలు చేసి నిమజ్జనం చేయడం జరిగింది.విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్థానిక ప్రజలు దేవుడు నీ కోరుకోవడం జరిగింది.మంచి భక్తి భావం తో చిన్నారులు, మహిళలు నృత్యాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మహిళలు, చిన్నారులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

## 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ అమలు చేయాలి: మాజి మంత్రి టి.జీవన్‌రెడ్డి



**జగిత్యాల, సెప్టెంబర్ 23 (ప్రజా మంటలు):** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించడంతో పాటు 51 శాతం ఫిట్‌మెంట్‌తో పే రివిజన్ కమిషన్ (పీఆర్‌సీ)ను అమలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆయన లేఖ రాశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జీవన్‌రెడ్డి కోరారు. 2023 ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, ఓపీఎస్ అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 2023 నుంచి పీఆర్‌సీ అమలు చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. గతంలో 42 శాతం ఫిట్‌మెంట్ అమలు చేసిన నేపథ్యంలో ప్రస్తుతం కనీసం 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.20 వేల కోట్ల బకాయిలను చెల్లించడంతో పాటు ప్రతి నెలా రూ.2 వేల కోట్ల చొప్పున బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఇతర సమస్యలను పరిష్కరించాలని జీవన్‌రెడ్డి లేఖలో విజ్ఞప్తి చేశారు.

# రిమ్స్ అగ్ని ప్రమాదంపై నివేదిక కోరిన మానవ హక్కుల కమీషన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (ప్రజా మంటలు):** ఆదిలాబాద్ రిమ్స్‌లోని స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందిన ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు స్వీకరించింది.డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్ ఈ ఘటనపై పలు పత్రికల్లో వచ్చిన వార్తలను పరిగణనలోకి తీసుకుంది. ఎయిర్ కండిషనింగ్ యూనిట్‌కు సంబంధించిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి, ఎస్ఎన్‌సీయూలో దట్టమైన పొగ వ్యాపించినట్లు వార్తా కథనాల్లో పేర్కొన్న అంశాలను కమిషన్ పరిశీలించింది.ప్రమాద సమయంలో సుమారు 27 మంది నవజాత, ముందస్తు జన్మించిన శిశువులు చికిత్స పొందుతున్నట్లు, ముగ్గురు శిశువులు మృతి చెందగా పలువురికి పొగ కారణంగా శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తినట్లు వార్తల్లో వచ్చిన వివరాలను కమిషన్ పరిగణనలోకి తీసుకుంది.ఎస్ఎన్‌సీయూలో విద్యుత్, ఏసీ వ్యవస్థల నిర్వహణ, ఫైర్ అలారాలు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర తరలింపు ఏర్పాట్లు, ఇతర అగ్ని భద్రతా చర్యలపై కూడా కమిషన్ వివరాలు కోరింది.ఈ నేపథ్యంలో ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, శిశువుల మృతికి కారణాలు, ఆసుపత్రిలో భద్రతా ఏర్పాట్లు, ప్రమాద సమయంలో చేపట్టిన రక్షణ, వైద్య చర్యలు, ఘటనపై నిర్వహించిన విచారణ తదితర అంశాలతో సమగ్ర నివేదికను సమర్పించాలని తెలంగాణ ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిని టీజీహెచ్ఆర్‌సీ ఆదేశించింది.

# యువత ఆధ్వర్యంలో ఘనంగా గణపతి నిమజ్జనం

## యువత సేవా స్ఫూర్తి అభినందనీయం: అడువాల జ్యోతి లక్ష్మణ్



**జగిత్యాల, సెప్టెంబర్ 23 (ప్రజా మంటలు):** జగిత్యాల పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాథుల నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. నిమజ్జన వేడుకలను విజయవంతంగా నిర్వహించడంలో యువత కీలక పాత్ర పోషించిందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు.నిమజ్జన ఊరేగింపులో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా గణనాథుడికి వీడ్కోలు పలికారని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడటంతో పాటు మహిళలు, చిన్నారులు, వృద్ధులకు సహకరించడం, రద్దీ నియంత్రణలో పోలీసులకు సహకరించడం అభినందనీయమన్నారు.పండుగల సందర్భంగా యువత ప్రదర్శిస్తున్న సేవా స్ఫూర్తిని భవిష్యత్తులోనూ సామాజిక సేవా కార్యక్రమాల్లో కొనసాగించాలని జ్యోతి లక్ష్మణ్ ఆకాంక్షించారు. నిమజ్జనం ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన మండపాల నిర్వాహకులు, యువజన సంఘాలు, భక్తులు, పోలీసు సిబ్బంది, అధికారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల కౌన్సిలర్ మూలస్తాం లావణ్య మహేష్, మాజీ కౌన్సిలర్ మూలస్తాం లలిత, మూలస్తాం రాజేందర్‌తో పాటు మహిళలు, చిన్నారులు, యువత పాల్గొన్నారు.ద

# వినాయక నిమజ్జనం సందర్భంగా సెప్టెంబర్ 25న సెలవు

హైదరాబాద్: సెప్టెంబర్ 23 (ప్రజా మంటలు): వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు,కళాశాలలకు తెలంగాణ ప్రభుత్వం సాధారణ సెలవు ప్రకటించిందని ట్రస్మా నాయకులు పల్లె వినయ్ కుమార్ తెలిపారు.సెప్టెంబర్ 25 శుక్రవారం ప్రకటించిన సెలవుకు బదులుగా నవంబర్ 14, 2026 (రెండో శనివారం)ను పనిదినంగా పరిగణించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వ అధికారిక క్యాలెండర్‌లోనూ 2026 సెలవుల వివరాలు అందుబాటులో ఉన్నాయి.

# ఖైరతాబాద్ బడా గణేష్‌ను దర్శించుకున్న మర్రి శశిధర్ రెడ్డి



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 23 ( ప్రజా మంటలు):** హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ బడా గణేష్‌ను మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు మర్రి శశిధర్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గణనాథుడికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో తీవ్ర వాయు"గండం" ఏపీలో పలు జిల్లాలో భారీ వర్షాలు



వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఉత్తరాంధ్ర తీరాన్ని ఆనుకుని పశ్చిమ వాయవ్య దిశగా కదులుతుండటంతో ఉత్తర కోస్తా జిల్లాలు అప్రమత్తమయ్యాయి. వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఉత్తరాంధ్ర తీరాన్ని ఆనుకుని పశ్చిమ వాయవ్య దిశగా కదులుతుండటంతో ఉత్తర కోస్తా జిల్లాలు అప్రమత్తమయ్యాయి. దీని ప్రభావంతో వచ్చే 24 గంటల్లో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. విశాఖపట్నం--గోపాల్‌పూర్ మధ్య రాత్రికి తీరం దాటే అవకాశం ఉండటంతో ఉత్తర కోస్తా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని అధికారులు తెలిపారు.ప్రస్తుతం తీవ్ర వాయుగుండం విశాఖపట్నానికి తూర్పున 220 కి.మీ., కళింగపట్నానికి తూర్పు ఆగ్నేయంగా 140 కి.మీ., గోపాల్‌పూర్‌కు దక్షిణ ఆగ్నేయంగా 150 కి.మీ., పూరీకి దక్షిణ నైరుతిగా 210 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉదయం 11.30 గంటల వరకు ఫ్లాష్ ఫ్లడ్ అలర్ట్ కూడా జారీ చేశారు.పలు జిల్లాల్లో సెలవులు: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, కాకినాడ జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యంత్రాంగం అప్రమత్తం: ఉత్తరాంధ్రలో భారీ వర్షాలపై ఈపీడీసీఎల్ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు కూలిన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు.మరోవైపు మన్యం, అల్లూరి, పోలవరం ప్రాంతాల పరిస్థితిపై మంత్రి సంధ్యారాణి సమీక్షించారు. వర్షాలతో పాటు ఈదురుగాలులు, పిడుగులు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ప్రజలు చెట్ల కింద, గుట్టల సమీపంలో, హోర్డింగ్‌ల వద్ద నిలబడవద్దని హెచ్చరించారు. పిడుగుల ప్రమాదం దృష్ట్యా రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. సంధ్యారాణి మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని సూచించారు. వాగులు దాటే పరిస్థితి ఉంటే పాఠశాలలకు సెలవు ప్రకటించాలి సంధ్యారాణి తెలిపారు.శ్రీకాకుళంలో ప్రత్యేక నిఘా: తీవ్ర వాయుగుండం ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్రతనయ నదులకు వరదలు వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. నదీపరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. శ్రీకాకుళం జిల్లాలోని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. జిల్లాలోని 11 తీర మండలాల్లో ప్రత్యేక అధికారులను నియమించి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర సాయం కోసం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 08942-240557ను సంప్రదించాలని అధికారులు సూచించారు.మరోవైపు కాకినాడ జిల్లాలో పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి నుంచి ఎడతెరపి లేకుండా తేలికపాటి వర్షం కురుస్తోంది. కాకినాడ, పిఠాపురం, తుని పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కాకినాడ జిల్లాలో వర్షాల వల్ల అన్ని విద్యాసంస్థలకు కలెక్టర్ షణ్మోహన్... కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సెలవులు ప్రకటించారు. పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు కలెక్టర్ సెలవులు వెల్లడించారు.

# టాప్‌టెన్‌లో ఏపీ ఎగుమతుల్లో దేశంలోనే ఏడో స్థానంలో ఆంధ్రప్రదేశ్



దేశంలోని రాష్ట్రాల నుంచి ఎగుమతులను అంచనా వేయగా రెండు తెలుగు రాష్ట్రాలు 7, 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి. 7వ స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలవగా, 8వ స్థానంలో తెలంగాణ ఉంది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఎగుమతులకు సంబంధించి తాజా గణాంకాలను విడుదల చేసింది. అందులో వస్తువుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఏడవ స్థానంలో నిలిచింది. రూ.1.77 లక్షల కోట్ల విలువైన వస్తువులను ఎగుమతి చేయడం ద్వారా రాష్ట్రం ఒక నూతన మైలురాయిని చేరుకుంది.ఏడు, ఎనిమిది స్థానాల్లో తెలుగురాష్ట్రాలు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో ఏడవ స్థానాన్ని దక్కించుకుంది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ విడుదల చేసిన 2025-26 కాలానికి సంబంధించిన గణాంకాల ప్రకారం, భారతదేశంలోని అన్ని రాష్ట్రాల మొత్తం ఎగుమతుల విలువ సుమారు రూ.39.04 లక్షల కోట్లుగా నమోదైంది. ఈ మొత్తం ఎగుమతులలో ఆంధ్రప్రదేశ్ రూ.1.77 లక్షల కోట్ల వాటాను (దేశం మొత్తం ఎగుమతులలో 4.57%) సమకూర్చినట్లు డీజీఎఫ్‌టీ నివేదించింది. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలు మొదటి మూడు స్థానాల్లో నిలవగా, తెలంగాణ 3.18% వాటాతో ఎనిమిదవ స్థానంలో నిలిచింది.2024-25తో పోలిస్తే రాష్ట్ర ఎగుమతుల విలువ 0.43% పెరిగింది. ఇది 2024-25లో ఉన్న రూ.1.76 లక్షల కోట్ల నుంచి 2025-26లో రూ.1.77 లక్షల కోట్లకు చేరింది. దక్షిణ భారత రాష్ట్రాలలో, 2024-25తో పోలిస్తే తమిళనాడులో 18.59%-కర్ణాటకలో 17.59% వృద్ధి నమోదైంది. తెలంగాణ నుంచి ఎగుమతులు 24.24% మేర భారీగా తగ్గాయి. 2024-25లో రాష్ట్రం రూ.1.62 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 2025-26 నాటికి ఆ విలువ రూ.1.23 లక్షల కోట్లకు పడిపోయింది.841 రకాల ఉత్పత్తులను ఎగుమతి : రాష్ట్రం వివిధ దేశాలకు 841 రకాల ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. అగ్రశ్రేణి 10 విభాగాలలో సముద్ర ఉత్పత్తులు, ఔషధాలు, పొగాకు, సేంద్రీయ రసాయనాలు, చేపల వేట నౌకలు, పెట్రోలియం నూనెలు, బియ్యం, ఫెర్రో-అల్లాయ్స్, మిరపకాయలు, చక్కెర వంటివి ముఖ్యమైనవి. రాష్ట్ర ఉత్పత్తులకు ప్రధాన ఎగుమతి గమ్యస్థానాలలో అమెరికా, చైనా, సింగపూర్, బెల్జియం, యూఏఈ వియత్నాం, రష్యా, మలేషియా, బ్రెజిల్, ఇండోనేషియా ఉన్నాయి. ఈ ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు రకాల చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకుంది. ఆంధ్ర రాష్ట్రాన్ని ఎగుమతులకు కేంద్రంగా మార్చేందుకు కొన్ని సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. అందులో ప్రపంచ స్థాయి ఎగుమతి మౌలిక సదుపాయాలు కల్పించడం. అలానే దానికి తోడు జాతీయ స్థాయి ఎగుమతి సంస్థలతో సమన్వయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.ప్రతి జి ల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చే ఉత్పత్తులను గుర్తించి, వాటిని 'క్లస్టర్' (సమూహ) ఆధారిత విధానం ద్వారా అభివృద్ధి చేస్తున్నారు. 45 'కామన్ ఫెసిలిటీ సెంటర్ల'ను (ఖజీజలు) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎంఎస్ఎంఈలు, రైతులు, చిన్న తరహా పరిశ్రమలు తమ ఉత్పత్తులను విదేశీ మార్కెట్లలో విక్రయించేలా ప్రోత్సాహించడం.ఎగుమతిదారులకు రవాణా, నిర్వాణ (లాజిస్టిక్స్) ఖర్చులను తగ్గించడం.ఈ-కామర్స్, డిజిటల్ మార్కెటింగ్ ద్వారా జిల్లా-స్థాయి ఉత్పత్తులు, సేవలకు అంతర్జాతీయ గుర్తింపును పొందడం.

# ఆదిలాబాద్ రిమ్స్ పిల్లల వార్డులో ఏసీ పేలిన ఘటన - ఐదుకు చేరిన మృతుల సంఖ్య



ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన చిన్నారుల సంఖ్య ఐదుకు పెరిగింది. అర్ధరాత్రి ఇంక్యుబేటర్ వార్డులో ఏసీ పేలి జరిగిన ఈ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు.ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో పిల్లలవార్డులోని నియోనాటల్ స్పెషల్ కేర్ యూనిట్- ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపిన విషయం తెలిసిందే. తాజాగా ఈ ఘటనలో మృతిచెందిన చిన్నారుల సంఖ్య ఐదుకు చేరింది. ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్‌కు చెందిన దుర్గబాయి బిడ్డ రిమ్స్‌లో మృతి చెందారు. ఇంద్రవెల్లి మండలం దుబ్బగూడకు చెందిన నాగుబాయి బిడ్డను నిర్మల్‌కు తరలిస్తుండగా మృత్యువాత పడ్డారు.సోమవారం అర్ధరాత్రి రిమ్స్ ఆస్పత్రిలో పేలి దట్టంగా పొగ అలముకుంది. ఆ సమయంలో ఇంక్యూబెటర్లలో 27 మంది పసికందులు చికిత్స పొందుతుండగా, పొగ కారణంగా వారికి ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, వైద్యాధికారులు, అద్దాలను పగలగొట్టి పసికందులను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఇచ్చోడకు చెందిన సలీం ఐదురోజుల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. అనంతరం మరో చిన్నారి కూడా ప్రాణాలు విడిచింది. పరిస్థితి విషమంగా ఉన్న 20 రోజుల చిన్నారిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ చిన్నారి మృతి చెందింది. తాజాగా మృతిచెందిన పసికందుల సంఖ్య ఐదుకు చేరింది.

**ఏసీ పేలి కలకలం**

అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా ఏసీ పేలిపోవటం కలకలం సృష్టించింది. ఈ ఘటనతో ఉలిక్కిపడిన సిబ్బంది హాహాకారాలతో భయానక వాతావరణం నెలకొంది. ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో రౌండ్స్‌కు వచ్చిన డైరెక్టర్ జైసింగ్ విషయం తెలుసుకొని సిబ్బంది సహా అంబులెన్స్ డ్రైవర్లతో కలిసి ఎస్ఎన్‌సీయూ వెళ్లగా ఊపిరి ఆడనీయకుండా దట్టమైన పొగ అలముకుంది. ఈ ఘటన గురించి తెలుసుకున్న కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను ఓదార్చే ప్రయత్నం చేశారు."నేను ఒక పేషెంట్‌ను చూడటానికి వచ్చాను. ఆస్పత్రి డైరెక్టర్‌తో మాట్లాడుతున్న క్రమంలో ఒక నర్సు వచ్చి బ్లాస్ట్ అయ్యి పొగ వస్తుందని చెప్పడంతో అందరం లోపలికి వెళ్లాం. అప్పటికే నల్లటి పొగ కమ్ముకుంది. మొత్తం చీకటిగా ఉంది. కరెంటు కూడా లేదు. కొంతమంది పసిపిల్లలను బయటకు తీసుకొచ్చాం. పొగ కారణంగా మా దుస్తులు మొత్తం నల్లగా అయ్యాయి" - సంతోశ్, ప్రత్యక్ష సాక్షి, ఆదిలాబాద్

**ఘటనపై విచారణకు సీఎం ఆదేశం**

ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. చికిత్స పొందుతున్న మిగిలిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. పలువురు మంత్రులు సైతం రిమ్స్ ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

**ఆసుపత్రిని పరిశీలించిన మంత్రి దామోదర**

ప్రమాదం దృష్ట్యా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. ముగ్గురు చిన్నారుల మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై కమిటీ వేశామన్న మంత్రి, నివేదిక వచ్చిన అనంతరం కార్యాచరణ చేపడతామన్నారు. రిమ్స్‌లో ఎమర్జెన్సీ, హెమటాలజీ, తల్లి, పిల్లల వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించి మెరుగైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే రిమ్స్‌లో 100 పడకలతో వీజు భవనం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.ముగ్గురు చిన్నారులు చనిపోవడం బాధాకరం. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. కమిటీ నివేదిక అనంతరం చర్యలు తీసుకుంటాం - దామోదర రాజనర్సింహ, వైద్యారోగ్యశాఖ మంత్రి

**కేటీఆర్ దిగ్భ్రాంతి**

రిమ్స్‌లో చిన్నారుల మృతిపై కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్'లో అగ్నిప్రమాదంపై ఆవేదనకు గురైనట్లు తెలిపారు. చిన్నారులందరూ క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# తెలంగాణకు వాయు'గండం' 17 జిల్లాలకు రెడ్ అలర్ట్



రాష్ట్రానికి భారీ వర్ష సూచన ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 25,26 తేదీల్లో పలు చోట్ల అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఈ మేరకు పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో బుధ, గురువారాల్లో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వాయుగుండానికి తోడు కర్ణాటక, కోస్తాంధ్ర మీదుగా ద్రోణి కూడా కొనసాగుతున్నట్లు ఐఎండీ తెలిపింది. వీటి ప్రభావం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కొన్ని చోట్ల 20.4 సెంటీమీటర్లకు పైగా అతి భారీ వర్షాలు కురుస్తాయని, మరికొన్ని చోట్ల 11.5 సెంటీమీటర్ల నుంచి 20.4 సెం.మీలోపు అతి కుండపోత వర్షాలు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇతర జిల్లాల్లోనూ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే సూచనలున్నట్లుగా వాతావరణశాఖ తెలిపింది. 25, 26 తేదీల్లోనూ పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.బుధవారం రెడ్' అలర్ట్ ఉన్న జిల్లాలు : జయంశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, కుమురం భీం ఆసిఫాబాద్, ములుగు, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, జనగామ, సిద్దిపేట.

**ఆరెంజ్ అలర్ట్ ఉన్న జిల్లాలు : ఆదిలాబాద్, నిర్మల్.**

గురువారం 'రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాలు : కరీంనగర్, ఆసిఫాబాద్, హనుమకొండ, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్,ఆరెంజ్ అలర్ట్ ఉన్న జిల్లాలు : నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్, నిర్మల్, ఖమ్మం, రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, జనగామ, సిద్దిపేట.

**పలు చోట్ల భారీ వర్షాలు**

రాష్ట్రంలో మంగళవారం పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో భారీ వర్షాలు ముంచెత్తాయి. ఖైరతాబాద్‌లో 3.2 సెం.మీ., కూకట్‌పల్లి 2.8, ముషీరాబాద్ 2.5, అబ్దుల్లాపూర్‌మెట్ 2.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కాప్రా, బోయిన్‌పల్లి, గాంధీనగర్, దుండిగల్, రామనగర్, అంబర్‌పేట, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ఎస్ఆర్‌నగర్, బోరబండ, కోఠి, లక్డీకపూల్, సైదాబాద్, ఐఎస్‌సదన్, మదనపేట్, మలక్‌పేట్, చాదర్‌ఘాట్, చంపాపేట్, సంతోష్‌నగర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులపై నీరు చేరింది. రహదారులపైకి నీరు చేరడంతో మాదాపూర్, టోలీచౌక్ వంతెనపై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఎం రేవంత్ రెడ్డి**

భారీ వర్షాలున్నాయనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నగర పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హైడ్రా, పోలీసు కమిషనర్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం సూచించారు. ప్రధాన రహదారులు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

హైదరాబాద్‌లో వర్షాల దృష్ట్యా అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గణేశ్ నిమజ్జనాల దృష్ట్యా అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఇబ్బందులు రాకుండా చూడాలని తెలిపారు. అత్యవసర ప్రయాణాలు మినహా మిగిలిన వాటిని వాయిదా వేసుకోవాలని సూచించారు.

# ప్రభుత్వానికి 121 ఎకరాల భూమిని వెనక్కిచ్చిన రామ్‌కో సిమెంట్స్!

**నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలో భూములు మైనింగ్‌కు ఆటంకాలే కారణమని తెలిపిన**

**కంపెనీ భూముల సరెండర్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**




ప్రముఖ సిమెంట్ ఉత్పాదక సంస్థ రామ్‌కో సిమెంట్స్, గతంలో తమకు కేటాయించిన భూమిలో కొంత భాగాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తిరిగి అప్పగించింది. నంద్యాల జిల్లాలో సున్నపురాయి మైనింగ్ నిమిత్తం కేటాయించిన 121.74 ఎకరాల భూమిని సరెండర్ చేస్తున్నట్లు కంపెనీ చేసిన విజ్ఞప్తికి రాష్ట్ర గనుల శాఖ ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది.నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండల పరిధిలోని ఇటిక్యాల, కల్వట్ల, కొలిమిగుండ్ల గ్రామాల్లో ఈ భూమి విస్తరించి ఉంది. వాస్తవానికి, 2000వ సంవత్సరంలో రామ్‌కో సిమెంట్స్ సంస్థకు ప్రభుత్వం సుమారు 250 హెక్టార్ల భూమిని సున్నపురాయి మైనింగ్ లీజుకు కేటాయించింది. అందులో భాగంగా ఉన్న 121.74 ఎకరాల భూమిని తాజాగా కంపెనీ ప్రభుత్వానికి అప్పగించింది.ఆ భూమిలో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించడం సాధ్యం కావడం లేదని రామ్‌కో సిమెంట్స్ తన అభ్యర్థనలో పేర్కొంది. లీజుకు తీసుకున్న భూమిని ఆనుకుని ఒక కాలువ ప్రవహిస్తుండటంతో పాటు, అదే ప్రాంతంలో హై-టెన్షన్ విద్యుత్ టవర్లు ఉండటం వల్ల మైనింగ్ పనులకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని కంపెనీ స్పష్టం చేసింది.కంపెనీ విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు. సంస్థ స్వచ్ఛందంగా ముందుకు రావడంతో, సదరు 121.74 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంతో ఈ భూమిపై రామ్‌కో సిమెంట్స్ మైనింగ్ హక్కులు రద్దయ్యాయి.

# నిమ్స్ వైద్యుడి నివాసంలో ఏసీబీ సోదాలు.. రూ. 80 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు

**నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ దాడులు**

**రూ.80 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించిన అధికారులు**

**హైదరాబాద్, విశాఖ, ఇతర ప్రాంతాల్లో ఫ్లాట్లు, ప్లాట్లు, బంగారం**

**బ్యాంకుల్లో రూ.41 లక్షల నగదు, ప్రైవేటు సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు**

**20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తున్న లక్ష్మీభాస్కర్‌పై గతంలోనూ ఆరోపణలు**



హైదరాబాద్ లోని ప్రతిష్టాత్మక నిమ్స్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ నివాసంలో భారీగా ఆస్తులు వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఏకకాలంలో ఆయన నివాసం, కార్యాలయంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ .80 కోట్లకు పైగా విలువైన స్థిర, చరాస్తులను గుర్తించడంతో అధికారులు విస్తుపోయారు.ఏసీబీ గుర్తించిన ఆస్తుల వివరాల ప్రకారం, కూకట్‌పల్లిలో రెండు విలాసవంతమైన ఫ్లాట్లు, మణికొండ, పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో మరో ఐదు ఫ్లాట్లు ఉన్నాయి. వీటితో పాటు యాదాద్రి, నందిగామ, శామీర్‌పేటలో నాలుగు ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్నంలో 800 గజాల స్థలం ఉన్నట్లు తేలింది. అలాగే, వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 41 లక్షల నగదు, పోస్టాఫీసు ఖాతాల్లో రూ. 12 లక్షల డిపాజిట్లు, ఒక ప్రైవేటు సంస్థలో రూ. 35 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. వీటితో పాటు 517 గ్రాముల బంగారం, మూడు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.డాక్టర్ లక్ష్మీభాస్కర్ గత 20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తుండగా, గత ఐదేళ్లుగా డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనపై గతంలోనూ పలు ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఏసీబీ అధికారులు లభ్యమైన ఆస్తుల పూర్తి విలువను అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

# ఉత్తరాంధ్రకు ఆకస్మిక వరదలు రెడ్ అలెర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ



వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో వర్షాలు దంచికొడుతున్నాయి. పలుచోట్ల రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఇవాళ రాత్రికి ఉత్తర కోస్తా-దక్షిణ ఒడిశా తీరంలోని విశాఖ-గోపాల్‌పూర్ మధ్య తీవ్ర వాయుగుండంగానే తీరం దాటే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. దీని ప్రభావంతో ఇవాళ, రేపు పలుచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆకస్మిక వరదలొచ్చే అవకాశం ఉందని ఇప్పటికే రెడ్ ఎలర్ట్ ప్రకటించింది. తీవ్ర వాయుగుండం తీరం దాటే సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయనున్నట్లు వెల్లడించింది. అతిభారీ వర్షాల హెచ్చరికలతో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కంట్రోల్ రూంలు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో వర్షాలు దంచికొడుతున్నాయి. పలుచోట్ల రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో వర్షాల ధాటికి వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. టెక్కలి మండలం పెద్దరోకళ్లపల్లి మార్గంలో గెడ్డ ఉప్పొంగి రహదారిపైకి ప్రవహించింది. దీంతో పెద్దరోకళ్లపల్లి, సీతారాంపల్లి, రామానగరం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొంత మంది ప్రమాదకరంగా నీళ్లలోనే బైక్‌ను నడిపించి తీసుకొచ్చారు.రాకపోకలకు అంతరాయం: వర్షం ధాటికి విజయనగరం జిల్లాలోని గింజేరు గెడ్డకు నీరు భారీగా వచ్చింది. దీంతో గంట్యాడ మండలం చంద్రంపే-వసంత గ్రామాల మధ్య రహదారి మునిగిపోయింది. అప్రమత్తమైన అధికారులు రాకపోకలు నిలిపివేశారు. వర్షాల నేపథ్యంలో విజయనగరం జిల్లాలోని పలు గిరిజన, రహదారి సౌకర్యం లేని గ్రామాల్లోని గర్భిణీలను అధికారులు మెంటాడలోని పీహెచ్‌సీకి తరలించారు.ముమ్మరంగా వ్యవసాయ పనులు: గతేడాది తుపాను సమయంలో జగన్నాథపురానికి చెందిన ఓ గర్భిణీని ఆసుపత్రికి తీసుకొస్తుండగా చంపావతి ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఆమెను ఆసుపత్రికి తీసుకొచ్చేందుకు అధికారులు నానా అవస్థలు పడ్డారు. ఈసారి అలాంటి పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో పలువురు గర్భిణీలను ముందుగానే ఆసుపత్రికి తరలించారు. అనకాపల్లి జిల్లాలో వర్షం దంచికొట్టింది. దీంతో వరినాట్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇన్నాళ్లూ నీరు లేక ఆపేసిన రైతులు వర్షం రాకతో నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు భారీ వర్ష సూచన దృష్ట్యా మంత్రి నిమ్మల రామానాయుడు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అప్రమత్తంగా ఉండాలని జలవనరుల శాఖ అధికారులకు సూచించారు. ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ఏటిగట్లు, చెరువుల భద్రతపై దృష్టి సారించాలన్నారు. కంట్రోల్ రూంలను 24 గంటలూ అందుబాటులో ఉంచాలని చెప్పారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com